
వామ్మో.. అనకొండలు!

- సూదికొండ, నెమలికొండ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు కబ్జా
- ఆక్రమణల అమ్మకం సొమ్ము రూ.40కోట్ల పైమాటే...
- నాలుగు ఎకరాల్లో కొత్తగా ఆక్రమణల గుర్తింపు
- ఆ స్థలాల్లో పొరుగు జిరాయితీ నెంబర్లు వేసి విక్రయాలు
- ఈసీ ఆధారంగా వారి పేర్లు గుర్తింపు
- రెవెన్యూ అధికారుల సర్వేలో విస్తుపోయే నిజాలు
- వారందరికీ నోటీసులు ఇచ్చేందుకు సన్నాహాలు



వైసీపీ నాయకుల చెరలో ఉన్న సూదికొండ భూములను కేంద్రీయ విద్యాలయానికి మంజూరు చేయడంతో చదును చేసిన దృశ్యం

పలాస, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో అనకొండలు పెద్ద ఎత్తున ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రధానంగా సూదికొండ, నెమలికొండ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను సొంత స్థలాలుగా చూపించి రూ.కోట్లకు పడగలెత్తారు. ఇందులో వైసీపీతోపాటు టీడీపీలోని కొంతమంది కీలకపాత్ర పోషించడం చర్చనీయాంశమవుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో దువ్వాడ శ్రీకాంత్‌కు సూదికొండపై కంకర తవ్వకాలకు అన్నీ అనుమతులు లభించాయి. దీంతో ఆయన కంకర తవ్వకాలు సాగించారు. అనంతరం శ్రీకాంత్- మాజీమంత్రి సీదిరి అప్పలరాజు మధ్య వైరం రావడంతో కొండపై తవ్వకాలు ఆగిపోయాయి. దీనివెనుక మాజీమంత్రి ప్రోత్సాహం ఉందని శ్రీకాంత్ భావించి.. వైసీపీ నుంచి కూడా ఆయన తప్పుకుని టీడీపీలో చేరారు. ఈ క్రమంలో కంకర తవ్వకాలు ఒకపక్క సాగుతుండగా వైసీపీ నాయకుల దందా అక్కడ ప్రారంభమైంది. చదును చేసే స్థలాలకు పట్టాలు సృష్టించి మొక్కలు నాటడం, పునాదులు వేయడం చేశారు. తప్పని తెలిసినా నాయకుల అండదండలతో మొత్తం సగం (మిగతా 6వ పేజీలో..)

- పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ ఒకటో వార్డుకు చెంది న వైసీపీ కార్యకర్త గతంలో గ్రామాల్లో జీడిపిక్కలు కిలోల వంతున కొనుగోలు చేసి గోనెసంచులతో తిరిగేవాడు. ప్రస్తు తం సర్వేనెంబరు 51లో సూదికొండ, నెమలికొండ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను సొంత స్థలాలుగా చూపించి రూ.కోట్లకు పడగెత్తాడు. ఖరీదైన కార్లులో షికార్లు చేస్తున్నాడు.
- మరో వ్యక్తి వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఓ ప్రజానాయకుడి వద్ద అసిస్టెంట్‌గా గతంలో పనిచేసేవాడు. పొరుగు గ్రామం నుంచి వచ్చి ఇక్కడ ప్రస్తుతం నెంబర్‌వన్ నాయకుడిగా ఎదిగాడు. ఇంటిలో ట్యూషన్లు చెప్పుకొని బతుకుదెరువు చూసుకునే ఈ ఆసామి ప్రస్తుతం రూ.కోట్లకు పడగెత్తాడు. రెండు కొండల్లో ప్రభుత్వ భూములు కబ్జా చేసి పక్క నెంబర్లతో రిజిస్ట్రేషన్లు చేసిన ఘన చరిత్ర ఉంది. అధికారులు ఆయన్ను ప్రశ్నిస్తే తాను ఇక్కడ అధ్యక్షుడినని, తన భూమినే లాక్కుంటారా? అంటూ చిందులు వేస్తాడు.
- మరో యువ నాయకుడు తన తల్లిపేరుతో ఎకరాల కొద్దీ భూమి ఉందని, దీన్ని కేంద్రీయ విద్యాలయం పేరుతో సేకరించడం తగదని.. ఆయన ఆధ్వర్యంలో స్థలాలను కొనుగోలు చేసే పేదలను రెచ్చగొడుతూ మొత్తం భూ కబ్జాలన్నీ అధికారపార్టీ నాయకులే చేస్తున్నారని ప్రచారాలు సాగిస్తున్నాడు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ పార్టీ నాయకులను మచ్చిక చేసుకొని పబ్బం గడుపుతున్న ఘన చరిత్ర ఈయనకు ఉంది.
- వీరితోపాటు మరో ఇద్దరు చోటా నాయకులు కూడా తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా నెమలి, సూదికొండ ప్రభుత్వ భూముల అమ్మకంలో చరిత్ర సృష్టించారు. తామేమీ తక్కువ తినలేదని అధికారపార్టీ కార్యకర్త ఒకరు నాయకుల పేరు చెప్పి చిన్నచిన్న ప్లాట్లు రూపేనా విక్రయించాడు. దీంతో ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చింది.
- ఇటీవల మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సూదికొండలో మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, పేదలు కట్టుకునే స్థలాలు తొలగించి.. పెద్దల స్థలాలు విడిచిపెట్టారని, అవికూడా టీడీపీ నాయకులకు చెందినవేనని తీవ్ర విమర్శలు చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా సూదికొండ ప్రాంతంలో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. ఆక్రమణల వ్యవహారం బయటపడింది.

వేరే సర్వే నెంబర్లతో విక్రయాలు..

మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తన బృందంతో సూదికొండను ఇటీవల పరిశీలించారు. ఆక్రమణ చెరలో ఉన్న భూములకు విముక్తి కల్పించాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు సూక్ష్మ పరిశీలన చేయగా సీన్ రివర్స్ అయి విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. సర్వేనెంబరు 51లో ఉన్న సూదికొండ ప్రభుత్వ స్థలాల్లో 4 ఎకరాలకుపైగా స్థలాలు వేరే సర్వేనెంబర్లు వేసి విక్రయించినట్టు వెలుగులోకి వచ్చింది. దీనిపై కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల అధికారులు ఆరా తీయగా ముందుగా అటువంటి సర్వేనెంబరులో రిజిస్ట్రేషన్లు జరగలేదని వచ్చింది. తరువాత సూక్ష్మపరిశీలనలో అదే నెంబరులో వేరే సర్వేనెంబరు వేసి పక్కా రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించారు. దీనికి సంబంధించి ఈసీ రికార్డు పరిశీలించగా అధికారులు ఆశ్చర్యపడాల్సి వచ్చింది. మొత్తం ఆ సర్వేనెంబరులో రిజిస్ట్రేషన్లు చేసినవారి వివరాలు సేకరించే పనిలో అధికారులు ఉన్నారు. ఇద్దరు సర్వేయర్లు, ముగ్గురు వీఆర్వోలతో కూడిన బృందం ఆ సర్వేలో వాస్తవాలు పరిశీలించి నివేదిక సిద్ధం చేస్తున్నారు. ఇదే అక్రమమని తేలితే ఈ స్థలాలు అమ్మకాలు చేసింది ఎవరనేది బట్టబయలు అవుతుందనడంలో సందేహమే లేదు. ఈ వ్యవహారంపై తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి వద్ద ప్రస్తావించగా.. 'నాలుగున్నర ఎకరాల స్థలం తప్పుడు సర్వేనెంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించాం. దీనిపై రికార్డులు పరిశీలిస్తున్నాం. గతంలో సర్వేనెంబరు 51లో పట్టాలు ఇచ్చింది, లేనిది పరిశీలిస్తున్నాం. పట్టాలు లేనివారిపై చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమ'ని తెలిపారు.

డీసీసీబీ చైర్మన్‌గా శివ్వాల



సరుబుజ్జిలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) చైర్మన్‌గా సరుబుజ్జిలి మండలం షలంత్రి గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు శివ్వాల సూర్యనారాయణను ప్రభుత్వం నియమించింది. తూర్పుకాపు సామాజిక వర్గానికి చెందిన ఈయన టీడీపీ ఆవిర్భావం నుంచీ పార్టీలో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. 1959లో రామన్న, నీలమ్మ దంపతులకు జన్మించారు. షలంత్రి సర్పంచ్‌గా సుమారు 13ఏళ్లు కొనసాగారు. 1996లో ఆయన సతీమణి కృష్ణవేణి జడ్పీటీసీగా సేవలందించారు. 2006లో సూర్యనారాయణ జడ్పీటీసీగా గెలుపొందారు. ప్రస్తుతం షలంత్రి ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. సరుబుజ్జిలి మండల టీడీపీ అధ్యక్షుడిగా 21ఏళ్లు బాధ్యతలు చేపట్టారు. జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా కూడా కొనసాగారు. గతేడాది శాసనసభ ఎన్నికల్లో సాలూరు, గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గాలకు రాష్ట్ర పార్టీ పరిశీలకుడిగా వ్యవహరించారు. వివాదరహితుడిగా గుర్తింపు పొందారు. సాధారణ కార్యకర్తగా జీవితం ప్రారంభించిన తనకు జిల్లాస్థాయిలో ప్రత్యేక స్థానం కల్పించిన సీఎం చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే రవికుమార్‌కు శివ్వాల కృతజ్ఞతలు తెలిపారు. సేవలకు తగిన గుర్తింపు లభించిందంటూ డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన శివ్వాలకు పలువురు టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

డీసీఎంఎస్ అధ్యక్షుడిగా చౌదరి అవినాష్



ఎచ్చెర్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) అధ్యక్షుడిగా ఎస్.ఎం.పురం గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ యువ నాయకుడు చౌదరి అవినాష్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ విధేయతకు కేరాఫ్‌గా నిలిచిన చౌదరి కుటుంబానికి డీసీఎంఎస్ అధ్యక్ష పదవిని అప్పగించడంతో హర్షం వ్యక్తమవుతోంది. ఇంజనీరింగ్ పట్టభద్రుడైన అవినాష్ 2013-18 మధ్య ఎచ్చెర్ల మండలం ఎస్ఎంపురం సర్పంచ్‌గా పని చేశారు. ఈయన తండ్రి చౌదరి నారాయణమూర్తి(బాబ్జీ) జడ్పీ విప్‌గా, వైస్ చైర్మన్‌గా, జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. తల్లి ధనలక్ష్మి జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. అవినాష్ తాతయ్య చౌదరి సత్యనారాయణ స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తింపు పొందడమే కాకుండా రెండుసార్లు ఎమ్మెల్యేగా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారు. యువకుడు, విద్యావంతుడైన అవినాష్‌కు డీసీఎం ఎస్ పదవి ఇవ్వడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతంలో ఇదే నియోజకవర్గం రణస్థలం మండలానికి చెందిన దివంగత డి.సత్యేంద్రవర్మ కూడా డీసీఎంఎస్ అధ్యక్షుడిగా పనిచేశారు.

ఎదురు చూడకుండానే..

- వితంతు పింఛన్ల మంజూరుకు చర్యలు
- సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో 4,623 మందికి వచ్చే అవకాశం

- మెళియాపుట్టి మండలం చీపురుపల్లి గ్రామానికి ఎస్.కృష్ణమూర్తి వృద్ధాప్య పింఛన్ పొందేవాడు. ఆయన గతేడాది జనవరిలో మృతి చెందాడు. దీంతో కృష్ణమూర్తి భార్య కాంతమ్మ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఇంత వరకు రాలేదు. అయితే, పింఛన్ తీసుకునే భర్త మృతి చెందితే అతని భార్యకు తక్షణమే వితంతువు పింఛన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కృష్ణమూర్తి భార్య కాంతమ్మకు పింఛన్ వచ్చే అవకాశం ఉంది.
- మెళియాపుట్టి మండలం పరశురాంపుం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ 2023 డిసెంబరులో మృతి చెందాడు. ఆయన భార్య వరహాలు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంది. రెండేళ్లవుతున్నా ఇంకా మంజూరు కాకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తాజా చర్యలతో ఆమెకు పింఛన్ అందనుంది.



పరశురాంపురం సచివాలయంలో వితంతువు పింఛన్ కోసం దరఖాస్తు(ఫైల్)

మెళియాపుట్టి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వితంతువులకు మే నెల నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేయనుంది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీచేసి.. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వంలో పింఛన్లు పొందేందుకు అర్హులు అనేక ఇబ్బందులు పడేవారు. అన్ని ధ్రువపత్రాలు ఇచ్చినప్పటికీ వారికి పింఛన్లు మంజూరయ్యేవి కావు. సచివాలయాలు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం శూన్యం. టీడీపీ ప్రభుత్వ హయాంలో వితంతువు పింఛన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగేది. వైసీపీ ప్రభుత్వం ఈ ఆనవాయితీకి బ్రేక్ వేసి.. ఆరు నెలలకోసారి దరఖాస్తులు పరిగణనలోకి తీసుకుని పింఛన్లు మంజూరు చేసేది. 2003 డిసెంబరు నుంచి కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ నిలిపేసింది. దీంతో చాలామంది పింఛన్ల కోసం ఎదురుచూస్తూ.. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతోంది. ముందుగా వితంతువులకు పింఛన్లు మంజూరు చేయనుంది. ఈ మేరకు 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 లోపు వృద్ధాప్య పింఛన్లు తీసుకుంటూ మృతిచెందిన వారి భార్యలు పింఛన్ల కోసం సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని పంచాయతీరాజ్‌శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో ఇలా చనిపోయినవారు 4,623 మంది ఉన్నారు. వీరి భార్యలందరికీ వితంతువు పింఛన్లు మంజూరు చేయనున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా దశల వారీగా కొత్త పింఛన్లు ఇవ్వడానికి కేబినెట్‌లో ఇటీవల తీర్మానం చేశారు. ముందుగా 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు వరకు 11 నెలలకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులు పరిశీలించి పింఛన్లు ఇవ్వనున్నారు. దీనివల్ల జిల్లాకు సంబంధించి ప్రతినెలా రూ.18.49 కోట్లు అదనపు భారం ప్రభుత్వంపై పడనుందని అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా ఎట్టకేలకు పింఛన్లు వస్తుండడంతో పేదల కళ్లల్లో ఆనందం కనిపిస్తుంది.

దరఖాస్తులు ఇవ్వాలి

2023 డిసెంబరు- 2024 అక్టోబరు మధ్యలో వృద్ధాప్య పింఛన్లు తీసుకున్న వ్యక్తులు మృతి చెందితే వారి భార్యలు సచివాలయాల్లో దరఖాస్తులు ఇవ్వాలి. గతంలో దరఖాస్తు చేసినా మరోసారి ఇవ్వాలి. వాటిని పరిశీలించి పింఛన్లు మంజూరు చేస్తాం.

-ప్రసాద్‌పండా, ఎంపీడీవో, మెళియాపుట్టి



మూలపేటలో పర్యటించిన కల్యాణి స్టీల్స్ బృందం(ఫైల్)

వెయ్యి ఎకరాల్లో కల్యాణి స్టీల్స్

- 'మూలపేట'లో ఏర్పాటుకు స్థల పరిశీలన

టెక్కలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం మూలపేటలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పరిధిలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. రూ.30వేల కోట్లతో వెయ్యి ఎకరాల్లో కల్యాణి స్టీల్స్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని (మిగతా 8వ పేజీలో..)

పది తర్వాత..

- ఇంటర్మీడియట్‌కు చెక్కుచెదరని ప్రాధాన్యం
- ట్రిపుల్ ఐటీ, ఐటీఐ, పాలిటెక్నిక్‌లోనూ అవకాశం

6లో



అసిస్టెంట్ కలెక్టర్‌గా పృథ్వీరాజ్ కుమార్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్త అసిస్టెంట్ కలెక్టర్‌గా దొనక పృథ్వీరాజ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2026 ఏప్రిల్ 24వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండల కేంద్రానికి చెందిన ఈయన 2024 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. వయసు 23 సంవత్సరాలు. తండ్రి విజయకుమార్ ఎంఈవోగా పనిచేస్తుండగా, తల్లి వెంకటరత్నం గృహిణి. సోదరి పూజిత ఆంధ్రా యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. పృథ్వీరాజ్ ప్రాథమిక విద్య 1- 10వ తరగతి వరకు పార్వతీపురంలో సాగింది. నారాయణ కాలేజీలో ఇంటర్ చదివారు. ఉస్మానియా యూనివర్శిటీ నుంచి డిగ్రీ పట్టా అందుకున్నారు. ఇగ్నోలో పీజీ పూర్తి చేశారు. ప్రజలకు చేరువగా ఉంటూ సేవలందించడమే తన లక్ష్యమని పృథ్వీరాజ్ కుమార్ తెలిపారు.

డీ పట్టా భూముల్లో.. 40 మంది నకిలీలు

- జగతిమెట్ట ఇళ్ల కాలనీలో బయటపడుతున్న అక్రమాలు
- ఒకే వీఆర్‌వో ఫోర్జరీ సంతకాలతో 8 జారీ
- ఆర్డీవో కృష్ణమూర్తి

8లో

రేపు 39 కేంద్రాల్లో పాలిసెట్

ఎచ్చెర్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికిగానూ ఈ నెల 30న జిల్లాలో 39 కేంద్రాల్లో పాలిసెట్ నిర్వహించనున్నట్టు సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ జె.సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (కుశాలపురం)లో సోమవారం పాలిసెట్ నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 'జిల్లాలో శ్రీకాకుళం సమన్వయ కేంద్రం పరిధిలో 25, టెక్కలి పరిధిలో 14కేంద్రాలు ఏర్పాటు చేశాం శ్రీకాకుళం పరిధిలో 6,953 మంది, టెక్కలి పరిధిలో 4,500 మంది పరీక్ష రాయనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. ఉదయం 9 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తాం. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు బాల్ పెన్ను, హెచ్‌బీ పెన్సిల్, రబ్బరు, షార్ప్‌నర్‌ను తీసుకురావాలి. ఓఎంఆర్ షీటులో ఆన్సర్‌లను హెచ్‌బీ పెన్సిల్‌తో బబ్లింగ్ చేయాలి. దరఖాస్తు చేసినప్పటికీ ఫీజు ప్రొసెసింగ్ జరగని విద్యార్థులు సమన్వయ కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం 5 గంటల్లోకి సంప్రదించి.. తగిన ఫీజు చెల్లించి హాల్‌టికెట్ పొందవచ్చు' అని తెలిపారు. పరీక్షల నిర్వహణకుగాను శ్రీకాకుళం కోర్డినేటర్ డాక్టర్ బి.జానకిరామయ్య (శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల), టెక్కలి కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎల్.విజయలక్ష్మి (చీపురుపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల) వ్యవహరించనున్నట్టు వివరించారు.



మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణమూర్తి



శ్రీకాకుళంలో దట్టంగా కమ్ముకున్న మేఘాలు

మురిపించిన మబ్బులు

అరసవల్లి/ టెక్కలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. ఎప్పుడు వర్షం పడుతుందా? అని జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు. సోమవారం సాయంత్రం నల్లని మబ్బులు కమ్మేసి.. చల్లని గాలులు వీయడంతో వర్షం పడుతుందని ఆశ పడ్డారు. కానీ, చిరుజల్లులు కురిసి.. మేఘాలు మాయమై పోవడంతో నిరాశ చెందారు. టెక్కలిలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గాలివాన బీభత్సం సృష్టించింది. మామిడి, చింతకాయలు నేలరాలిపోయాయి. అరటిచెట్లు పడిపోయాయి. గూడెం, మొఖలింగాపురం పంచాయతీల్లో విద్యుత్ అంతరాయంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు.



టెక్కలిలో మెరుపులు

పది తర్వాత..



తొమ్మిదో తరగతి వరకు ఏదోలా చదివేశారు. పదో తరగతి అలా కాదు.. పబ్లిక్. ఇది కాస్త మంచి మార్కులతో గట్టెక్కితే సూపర్‌రా బాబూ.. అనే వారు నిన్నటి తరం. ఇప్పుడు అలా కాదు. పదో తరగతి తర్వాతే అత్యంత కీలకమని చెబుతున్నారు నేటి తరం. పిల్లల ఆసక్తిని గమనించి, వారు ఏ సబ్జెక్ట్‌లో ప్రతిభ కన్పిస్తున్నారో గుర్తించి ముందుకు నడిపిస్తే సత్ఫలితాలు సాధించవచ్చు. పదో తరగతి వరకు ఎన్ని కోర్సులు అందుబాటులోకి వస్తున్నా, ఇంటర్మీడియట్‌కు ఉన్న ప్రాధాన్యం చెక్కు చెదరలేదనే చెప్పాలి.

- ఇంటర్మీడియట్‌కు చెక్కుచెదరని ప్రాధాన్యం
- ట్రిపుల్ ఐటీ, ఐటీఐ, పాలిటెక్నిక్‌లోనూ అవకాశం
- విద్యార్థుల ఆసక్తే ప్రధానమంటున్న విద్యావేత్తలు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి)

పదో తరగతి వరకు ఏ పాఠశాలలో చదివినా, ఆ తర్వాత మాత్రం ఏ కోర్సులో, ఎక్కడ చేర్చాలో ఆచితూచి అడుగువేయాలి. ఇంటర్మీడియట్ ఎక్కడ చదివిస్తే మంచిదో అనే ఆలోచనతో చాలామంది తల్లిదండ్రులు ఉన్నారు. ఎక్కడ చదివించినా, ఏ కోర్సు చదివించినా పిల్లల ఆసక్తిని తెలుసుకోవడం మాత్రం మరిచిపోరాదు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు అందుబాటులో ఉన్న కోర్సుల్లో చేర్పడమే తప్ప, దూరంలో ఉన్న మంచి కోర్సుల్లో జాయిన్ చేద్దామన్న ఆలోచన చేయడం లేదు. తద్వారా వారి పిల్లలు బంగారు భవితను కోల్పోతున్నారు. అంతా అయిన తర్వాత సరైన కళాశాలలో చదివించలేదని బాధపడేకన్నా, ముందుగానే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతోనే మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థుల ఆసక్తి మేరకే..

పదో తరగతి తర్వాత చదువుల ఎంపికలో తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యార్థుల ఆసక్తి మేరకు ఎంపిక చేసుకోవాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు పిల్లల ఆలోచనలు, ఉపాధ్యాయుల సలహాలు తీసుకుని నిర్ణయం తీసుకోవడం మంచిది. నలుగుర్నీ సంప్రదించడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. తొందరపడి నిర్ణయం తీసుకుంటే పిల్లల భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.

ఇంటర్మీడియట్‌లో ఇవీ గ్రూపులు..

- **ఎంపీసీ:** ఈ గ్రూపులో గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలు ప్రధాన సబ్జెక్టులు. ఈ గ్రూపులో చేరే విద్యార్థులకు గణితం పట్ల అమితమైన ఆసక్తి ఉంటే రాణిస్తారు. ఆ తర్వాత ఇంజనీరింగ్ కోర్సులో చేరి ఉన్నతంగా స్థిరపడేందుకు అవకాశముంది.
- **బైపీసీ:** ఈ గ్రూపులో వృక్ష, జంతు, భౌతిక, రసాయన శాస్త్రాలు ప్రధాన సబ్జెక్టులు. ఈ గ్రూపులో చేరి శ్రద్ధగా చదివితే మంచి భవిష్యత్ ఉంటుంది. ఎంట్రన్స్‌లో ప్రతిభ చూపడం ద్వారా ఎంబీబీఎస్, బీవీఎస్సీ, ఏజీ బీఎస్సీ తదితర కోర్సుల్లో సీటు పొందొచ్చు.
- **సీఈసీ:** ఈ గ్రూపులో కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ ప్రధాన సబ్జెక్టులు. ఈ గ్రూపులో చేరిన విద్యార్థులు భవిష్యత్‌లో సీఏలో చేరి ఆడిటర్లుగా స్థిరపడవచ్చు. ఇటీవల బ్యాంకింగ్ రంగంలో అవకాశాలు వస్తుండడంతో వాటిని అందిపుచ్చుకోవచ్చు.
- **హెచ్ఈసీ:** హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులతో కూడిన ఈ గ్రూపులో చేరి అసాధారణ ప్రతిభ చూపితే మంచి ఉద్యోగాలు పొందొచ్చు. ఏపీపీఎస్సీ, సివిల్స్ మెయిన్స్‌కు ఈ సబ్జెక్టులే కీలకం కానున్నాయి. చాలామంది సైన్స్ గ్రూపులతో చదివిన వారు కూడా ఈ సబ్జెక్టులతోనే ఏపీపీఎస్సీ, సివిల్స్‌లో ఎంపికైన సందర్భాలు ఉన్నాయి.

ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో..

ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల కళాశాలల్లో ప్రవేశం కోసం పదో పరీక్ష రాయాల్సి ఉంటుంది. తాటిపూడి (బాలికలు, విజయనగరం), నాగార్జునసాగర్ (బాలురు, గుంటూరు), వెంకటగిరి (బాలురు, నెల్లూరు), నిమ్మకూరు (కో ఎడ్యుకేషన్, కృష్ణా జిల్లా)లో గురుకుల కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో సీటు వస్తే భవితకు బంగారు బాట పడినట్టేనన్న అభిప్రాయం ఉంది.

ట్రిపుల్ ఐటీలో సీటు వస్తే..

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) పరిధిలో శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు, ఇడుపులపాయ (ఆర్కే వ్యాలీ)లో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు ఉన్నాయి. ఇది ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు. సాధారణంగా పదో తరగతిలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ప్రాప్తికి సీట్లను కేటాయిస్తారు. ట్రిపుల్ ఐటీలో సీటు వస్తే అటు నుంచి అటే బహుళ జాతి కంపెనీల్లో మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు సంపాదించవచ్చు.



ఐటీఐ కోర్సులు..

పదో తరగతి పూర్తయిన తర్వాత ఉన్నత చదువులు అవసరం లేకుండా స్వయం ఉపాధి ఏర్పాటుకు, పరిశ్రమల్లో, రైల్వే తదితర రంగాల్లో ఉద్యోగాలు సాధించేందుకు ఈ కోర్సులు బాగా ఉపయోగపడతాయి. ఫిట్టర్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ తదితర కోర్సులు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఐటీఐలు ఈ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. పరిశ్రమల్లో చాలామంది ఐటీఐ చదివిన అభ్యర్థులు స్థిరపడుతున్నారు.

ఇంటర్‌లో వృత్తివిద్యా కోర్సులు..

వృత్తి విద్యా కోర్సుల వల్ల ప్రయోజనం ఎక్కువే. వెటర్నరీ, అగ్రికల్చరల్, రేడియో అండ్ టీవీ, ఇంజనీరింగ్ టెక్నాలజీ, బిజినెస్ మేనేజ్‌మెంటు, పారా మెడికల్, ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్, కేటరింగ్, డెయిరీ, ఆప్తాలమిక్ అసిస్టెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గత ప్రభుత్వం నియామకాలు చేపట్టిన సచివాలయం ఉద్యోగాల్లో చాలామంది వృత్తి విద్యా కోర్సులు చదివిన వారు ఎంపికయ్యారు. ఇటీవల ఈ కోర్సులు చదివే వారి సంఖ్య పెరిగింది.







వ్యవసాయ కోర్సులు..

వ్యవసాయ కోర్సులకు భలే గిరాకీ ఉంది. డిప్లొమో ఇన్ అగ్రికల్చర్, వెటర్నరీ, హార్టికల్చర్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులు పూర్తిచేసిన వారు వ్యవసాయ అనుబంధ పరిశ్రమల్లో, విత్తనోత్పత్తి కేంద్రాల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చు. ప్రభుత్వ పరంగా వ్యవసాయశాఖలో ఏఈవోలు, ఆత్మ ప్రాజెక్టులో ఉద్యోగాలు సాధించవచ్చు.

పిల్లల ఆసక్తి మేరకే..



పిల్లల ఆసక్తిని తల్లిదండ్రులు గమనించాలి. వారి ఆసక్తి మేరకే ఇంటర్మీడియట్, సాంకేతిక విద్య ఏ కోర్సులో చేరినా.. విద్యార్థులు మానసికంగా సిద్ధంగా ఉన్నట్టయితే రాణించగలరు. ఇష్టం లేని కోర్సులో చేరి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు.

-డాక్టర్ జి.జానకిరామయ్య,
ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీకాకుళం

అభిరుచులను పిల్లలపై చూపొద్దు..



పదో తరగతి తర్వాత చాలా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కొంత మంది తల్లిదండ్రులు వారి అభిరుచులను పిల్లలపై చూపిస్తారు. దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న సందర్భాలు ఉన్నాయి. ఏ కోర్సులో చేరినా ఆసక్తి ఉంటే మంచిగా స్థిరపడవచ్చు.

-ఎల్.సుధాకరరావు,
ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ, ఎచ్చెర్ల

పాలిటెక్నిక్ కోర్సులు..

పదో తరగతి తర్వాత సాంకేతిక విద్యలో చేరాలన్న ఆసక్తి ఉంటే పాలిసెట్‌ను రాయాలి. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే దాదాపు అన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో కూడా పాలిటెక్నిక్ కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, సివిల్, కంప్యూటర్స్ కెమికల్, ఆటోమొబైల్ తదితర కోర్సులు ఉన్నాయి. ఈ కోర్సులను పూర్తిచేస్తే పబ్లిక్ మరియు ప్రైవేటు సెక్టార్లలో ఉద్యోగాలు సాధించవచ్చు. అలాగే సొంతంగా కూడా ఉపాధి ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈసెట్ రాసి ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో నేరుగా చేరవచ్చు.

కేంద్రీయ విద్యాలయానికి మార్గం సుగమం

- స్థలాన్ని పరిశీలించిన కేంద్ర బృందం
- ఇక్కడ నిర్మిస్తే అందరికీ అందుబాటులోకి విద్య
- తాత్కాలికంగా పలాస రైల్వేస్కూల్‌లో తరగతుల నిర్వహణ



సూదికొండ వద్ద కేంద్రీయ విద్యాలయం స్థల వివరాలు బృందానికి వివరిస్తున్న ఆర్డీఓ జి.వెంకటేష్

పలాస, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కేంద్రీయ విద్యాలయాల డిప్యూటీ కమిషనర్ (హైదరాబాద్) డాక్టర్ డి.మంజునాథ్ కమల్‌జీత్‌గురు (విశాఖపట్నం), సుయాబ్‌ఆలం (శ్రీకాకుళం) బృందం సోమవారం మధ్యాహ్నం సర్వేనెంబరు 51, సూదికొండ ప్రభుత్వ భూములు పరిశీలించారు. విద్యాలయం తాత్కాలికంగా నిర్వహించేందుకు పలాస రైల్వేకాలనీలో ఉన్న పాత రైల్వే మిశ్రమ పాఠశాల (ప్రస్తుతం ఆర్పీఎఫ్ బ్యారెక్స్)ను పరిశీలించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని బృందం ప్రకటించింది. కొద్దిరోజుల క్రితం మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు సీదిరి అప్పలరాజు కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన స్థలంలో విలేకర్ల సమావేశం నిర్వహించి.. విద్యాలయం అసలు మంజూరే కాలేదని ఆరోపించిన నేపథ్యంలో.. కేంద్ర బృందం స్థల పరిశీలన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ బృందం మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఇక్కడ పర్యటించింది. ఆర్డీవో జి.వెంకటేష్, తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి ద్వారా వివరాలు తెలుసుకుంది. అనంతరం డిప్యూటీ కమిషనర్ డి.మంజునాథ్ విలేకర్లతో మాట్లాడుతు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అంతా సిద్ధమైందని, స్థలాలు కూడా బాగా ఉన్నాయని తెలిపారు.



కేంద్రీయ విద్యాలయం తాత్కాలికంగా నిర్వహించేందుకు సిద్ధమైన పలాస రైల్వే మిశ్రమ పాఠశాల

వామ్మో.. అనకొండలు!

(ఐదో పేజీ తరువాయి)

కొండ దిగువభాగంపై పట్టాలు సృష్టించుకున్నారు. తాము ఆక్రమించిన స్థలాన్ని మూర రూ.70వేలు లెక్కన ఒక్కో బిట్ విస్తీర్ణం బట్టి రూ.6 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు చొప్పున విక్రయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రీయ విద్యాలయానికి అనుమతులు లభించడంతో సర్వేనెంబరు 51లో కొండ దిగువభాగంలో ఉన్న మొత్తం ఆక్రమణలు తొలగించి 10ఎకరాల స్థలాన్ని రిజర్వు చేశారు. కంకర తవ్వకాలకు అనుమతులు ఉన్న దువ్వాడ శ్రీకాంత్ సైతం తన ప్రతిపాదన విరమించుకుని కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సహకారం అందించారు. దీంతో ఇటీవల ఆ స్థలాన్ని చదును చేశారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంలో ఓ టీడీపీ కార్యకర్త కూటమి ప్రభుత్వం రాకముందు నుంచి స్థలాలు ఆక్రమించి ప్లాట్లుగా అనేక మందికి విక్రయించాడు. ఇళ్లు, పునాదులు నిర్మిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఆశ కల్పించాడు. అలాగే కొంతమంది దీంతో రూ.లక్షలు పెట్టుబడి పెట్టి కొంతమంది గృహాలు, పునాదులు నిర్మించుకున్నారు. ఇటీవల మొత్తం వాటిని అధికారులు తొలగించడంతో అక్రమాల వ్యవహారం బయటపడింది. వైసీపీ, టీడీపీ నాయకులు మొత్తం కొండను ఆక్రమించి 300 ప్లాట్లకు పైగా స్థలాలను సుమారు రూ.40కోట్లకుపైగా విక్రయించినట్టు అంచనా. ఈ వ్యవహారం అంతా పొక్కడంతో కొనుగోలుదారులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష వద్ద మొర పెట్టుకున్నారు. ఆమె సూచనల మేరకు వారంతా పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ప్లాట్లు విక్రయించిన వైసీపీ, టీడీపీ నేతల గుండెల్లో అలజడి రేగుతోంది.

మాకివలసలో సిరిమాను సంబరాలు

- 30 ఏళ్ల తర్వాత అసిరితల్లి సిరిమాను పండుగ
- నేడు కుంకుమపూజలు



నరసన్నపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాకివలస గ్రామంలో 30 సంవత్సరాల తరువాత అసిరితల్లి సిరిమాను ఉత్సవాలు జరగనున్నాయి. సోమవారం గ్రామదేవత ఉత్సవాలకు అంకుర్పారణ చేశారు. మంగళవారం సమీపంలోని చింతచెట్టు (సిరిమాను)కు మంగళవాయిద్యాలతో గ్రామస్థులు ముర్రాటలు చెల్లించి.. పుసుపు, కుంకుమ పూజలను నిర్వహిస్తారు. మేనెల 6వ తేదీ వరకు జరిగే ఈ సిరిమాను అసిరితల్లి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేశారు. వచ్చే నెల 4న గ్రామంలోనికి దేవర తెచ్చుట, 5న కూటిఘటం ఊరేగింపు, 6న అమ్మవారిఘాటాలు, సిరిమాను ఊరేగింపు నిర్వహిస్తారు. రాష్ట్రస్థాయి కళాకారులచే మే 4 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు 3 రోజులు పాటు ఏర్పాటు చేశారు.

కనువిందు చేస్తున్న మే పుష్పాలు



సరుబుజ్జిలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం గ్రామంలో మే పుష్పాలు ఆకట్టుకుంటున్నాయి. గ్రామానికి చెందిన కూన పాపారావు నివాసంలో ఇవి విరబూశాయి. ఏటా మే నెలలో పూతకు వచ్చే ఈ పుష్పాలు ఈ ఏడాది ఏప్రిల్ చివరి వారంలోనే పూయడం విశేషం. అరుదుగా కనిపించే వీటిని స్థానికంగా చెంగల్వ పూలుగా పిలుస్తారు.

నృత్యంలో.. సిక్కోలు ఖ్యాతి



సింధు శ్రీహర్షిత నృత్య ప్రదర్శన



నీరజకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్(ఫైల్)

- వేలాది ప్రదర్శనలిచ్చిన నీరజ సుబ్రహ్మణ్యం
- తల్లిబాటలోనే ఆకట్టుకుంటున్న సింధు శ్రీహర్షిత
- నేడు ప్రపంచ నృత్య దినోత్సవం



మలేషియాలో తల్లి నీరజ, కుమార్తె సింధు శ్రీహర్షిత నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నృత్యంపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికీ పరిచయం అక్కరలేని పేరు నీరజ సుబ్రహ్మణ్యం. తన నృత్య ప్రదర్శనలతో దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా సిక్కోలు ఖ్యాతిని ఇనుమడింపజేశారు. ఆమె బాటలోనే కుమార్తె సింధు శ్రీహర్షిత కూడా నృత్యప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. నేడు ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా వారిపై ప్రత్యేక కథనం. శ్రీకాకుళంలోని టీపీఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నీరజ సుబ్రహ్మణ్యం హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించేవారు. చిన్నప్పటి నుంచి నృత్యంపై ఆమెకు ఉన్న ఆసక్తి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది. వేలాది ప్రదర్శనలు ఇచ్చి.. ఎన్నో అవార్డులు అందుకున్నారు. అక్కడితో ఆగకుండా అభినయ నృత్యనికేతన్ సంస్థను స్థాపించి సుమారు 100 మందికి పైగా నృత్యంపై శిక్షణ ఇస్తున్నారు.

ఎన్నో పురస్కారాలు, సత్కారాలు..

- 1992, 1994 మహారాష్ట్రలో మెహర్‌బాద్‌లో భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు చేస్తూ మెహర్‌బాబా కూతురు మెహర్‌మనిజా చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.
- 2002లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.
- బరంపురంలో నేషనల్ కాన్ఫరెన్స్ ఫర్ ఉమెన్స్ కార్యక్రమంలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.
- ఢిల్లీలో అంతర్జాతీయ నృత్య సమ్మేళనంలో అన్ని దేశాల నుంచి వచ్చి 1000 మందితో కలిసి ప్రదర్శన ఇచ్చి సత్కారం పొందారు.
- 2015లో కళాతేజం పురస్కారం, భాషశ్రీ పురస్కారం అందుకున్నారు.
- 2010లో నేపాల్‌లో హిమాలయ ప్రాంతంలో పశుపతినాథ్ ఆలయం వద్ద నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.
- 2014లో థాయ్‌లాండ్ దేశంలో నృత్య ప్రదర్శనలు ఇచ్చి అక్కడ మంత్రులు అధికారుల ప్రశంసలు అందుకున్నారు.
- 2017లో మలేషియాలో శత నృత్య ప్రదర్శనల్లో వివిధ దేశాల నుంచి వచ్చిన నృత్యకారులతో కలిసి ప్రదర్శన ఇచ్చారు.

టీవీ, చలనచిత్ర రంగంలోనూ..

- టెలివిజన్, చలనచిత్ర రంగంలోనూ నీరజ సుబ్రహ్మణ్యం తనదైన ప్రతిభ చూపారు. టెలిఫిలిమ్స్‌లో ఆమె దర్శకత్వం వహిస్తూ చిన్న చిన్న షార్ట్ ఫిలిమ్స్ చేశారు.
- 1995లో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో తీసిన టెలీఫిలింలో నటించి గుర్తింపు పొందారు.
- ఆదిత్య మ్యూజిక్ వారి ఉద య కిరణాలు ఆడియో వీడియో నిత్య ప్రదర్శన నిర్వహించారు.
- రాఘవేంద్రస్వామి సినిమా లో నటించి గుర్తింపు పొందారు.
- ఢిల్లీలో 6000 మందితో సిలికాంధ్ర ఇంటర్నేషనల్ నృత్య ప్రదర్శనలో కూచిపూడి మహత్యం నాట్యం ప్రదర్శించారు.
- 2014లో శిష్య బృందంచే నృత్య ప్రదర్శనలు చేసి గిన్నీస్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించారు.
- 2013లో ఢిల్లీలో ఏపీ భవన్‌లో కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేస్తూ నాట్యనీరజ బిరుదు కూడా పొందారు.
- హాయ్‌లాండ్‌లో వరల్డ్ బుద్ద టూరిజం ఆధ్వర్యంలో వండర్ వరల్డ్ వార్షికోత్సవంలో నృత్య ప్రదర్శన ఇచ్చారు.
- ఆడేపాడే తోలుబొమ్మ చలనచిత్రానికి నీరజా సుబ్రహ్మణ్యం కొరియోగ్రఫీగా వ్యవహరించారు. అందరూ మహిళలతోనే సినిమా తీయడం విశేషం.
- 'మా ఊరి మంకినమ్మ' చలన చిత్రానికి దర్శకత్వం వహించారు.
- ఉత్తమ యువనాట్య కళాకారిణి అవార్డు, ఉత్తమ నృత్య దర్శకురాలిగా మూడు గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎన్నో అవార్డులు అందుకున్నారు.

తల్లి అడుగుజాడల్లోనే కుమార్తె..

నృత్య దర్శకురాలు నీరజ సుబ్రహ్మణ్యం అడుగుల్లోనే ఆమె కుమార్తె సింధు శ్రీహర్షిత కూడా నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. బీఎస్సీ కంప్యూటర్స్ ఫైనల్ ఇయర్ చదువుతూ నృత్య ప్రదర్శనలు ఇస్తూ పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. ఈమె చిన్నప్పటి నుంచి తల్లి నీరజా సుబ్రహ్మణ్యం వద్ద కూచిపూడి నృత్యం నేర్చుకొని ఇప్పటి వరకు 2వేల వరకు ప్రదర్శనలు ఇచ్చారు. 23 పురస్కారాలు, 200పైగా సన్మానాలు పొందారు. మలేషియాలో తల్లి నీరజతోపాటు సింధు శ్రీహర్షిత కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చి ప్రశంసలు అందుకున్నారు. ఈమె కూడా 3 గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. ఈమె నాట్య రవళి, నాట్య మయూరి బిరుదులు పొందారు.

రేపటిలోగా రిటర్నులు దాఖలు చేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్టరీల చట్టం-1948 ప్రకారం రిజిస్టరైన రైస్ మిల్లులు, జీడిపిక్కల కర్మాగారాలు, గ్రానైట్ కర్మాగారాలు, స్టోన్ క్రషర్‌లు, సా మిల్లులు, ఇతర పెద్ద కర్మాగారాలన్నీ, ఇంటిగ్రేటెడ్ యాన్యువల్ రిటర్న్‌లను ఈ నెల 30వ తేదీలోగా సమర్పించాల్సి ఉంటుంది. వీటిని త్వరితగతిన సమర్పించాలని కర్మాగారాల ఉప ముఖ్య తనిఖీ అధికారి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపటి వరకు పన్ను బకాయిలపై రాయితీ

అరసవిల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో గల గృహ, వాణిజ్య సముదాయాల యజమానులు 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి చెల్లించవలసిన ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తున్నారు. ఈమేరకు 2025-26 సంవత్సరానికి ఆస్తిపన్ను బకాయిలు, కుళాయి, ఖాళీ జాగా పన్ను బకాయిలపై 5శాతం రాయితీ ఇస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 30వ తేదీలోగా చెల్లించాలని ప్రజలను కోరారు. మే నెల నుంచి అదనంగా 2శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పన్ను వసూళ్ల కోసం స్థానిక హడ్కో కాలనీ, గొంటి వీధి, సత్యనారాయణ కాలనీ, కిల్లిపాలెం-1, కిల్లిపాలెం-2 సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. దీనిపై ప్రత్యేకంగా ప్రచారం చేస్తున్నారు.

బొంతలకోడూరు సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బొంతలకోడూరు గ్రామ సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు చెక్‌పవర్‌ను ఆరు నెలల పాటు రద్దుచేస్తూ డీపీవో కె.భారతి సౌజన్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల ఆవరణలో సచివాలయం నిర్మించొద్దనే నిబంధనలు ఉన్నా, ఇందుకు విరుద్ధంగా సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ. 1,81,339 చెక్‌ను అందజేయడాన్ని తప్పుపడుతూ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ గ్రామానికి చెందిన కె.వెంకట సుబ్రమణ్యం 'మీకోసం'లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి, ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఆప్‌సా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కృష్ణవేణి

సరుబుజ్జిలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (ఆప్‌సా) ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రొట్టవలస కేరళ ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ బెవర కృష్ణవేణి ఎన్నికయ్యారు. ఈ మేరకు విజయవాడలో సోమవారం ఆప్‌సా కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

శివానీ ఇంజనీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి



అటానమస్ హోదా పత్రాన్ని చూపిస్తున్న ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు తదితరులు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)కు అటానమస్ స్టేటస్ (స్వయం ప్రతిపత్తి హోదా)ను యూజీసీ మంజూరు చేసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలో యాజమాన్య ప్రతినిధులు సాయినాథరెడ్డి, దుప్పల వెంకటరావు, ఎస్.శ్రీనివాస్, కె.దుర్గాశ్రీనివాస్, పి.దుర్గాప్రసాద్ రాజు, హరీష్‌లతో కలిసి సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటి వరకు ఈ కళాశాల జేఎన్‌టీయూ (విజయనగరం)కు అనుబంధంగా కొనసాగిందన్నారు. స్వయం ప్రతిపత్తి రావడంతో 2025-26 విద్యా సంవత్సరం నుంచి సొంతంగా సిలబస్ తయారీ, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం తదితర వాటిని మరింత సమర్థంగా నిర్వహిచనున్నట్టు చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించే ఫీజులే విద్యార్థులకు వర్తిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీటీ చంద్రశేఖర్, పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

ఆమదాలవలస, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొడ్డేపల్లిపేట వద్ద ఉన్న శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని విశ్రాంత ఉపాధ్యాయులు తమ్మినేని సూర్యనారాయణ ప్రారంభించారు. పిల్లలు వి శ్రాంతి సమయంలో ఆటలకు కొంత సమయం కేటాయించి... ఎక్కువ సమయం జ్ఞానాభివృద్ధికి కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అన్నెపు కోటేశ్వరరావు, విద్యార్థులు రోణంగి రేష్మ, వేదశ్రీ, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గారలో...

గార, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. లైబ్రేరియన్ ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ఆటలు పోటీలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో పాఠకులు జి.కుమారస్వామి, శరత్‌చంద్ర, సూర్య నారాయణ పాల్గొన్నారు.

కేంద్ర గ్రంథాలయంలో..

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో విశ్రాంత సీఈఓ సురంగి మోహనరావు, ఎం.ఉపేంద్ర శర్మ, ఎస్.సాయి, కృష్ణ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజ్, ఉప గ్రంథాలయాధికారి శంకర్‌రావు పాల్గొన్నారు.

సప్లిమెంటరీకి అవకాశం కల్పించండి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలలో కుప్పిలి మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో డిబారైన ఐదుగురు విద్యార్థులకు మేలో జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు అనుమతిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ హామీని విద్యాశాఖ అధికారులు నెరవేర్చలేదని, సోమవారం జిల్లా ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుల కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఏప్రిల్ 30 ఆఖరి రోజు. కానీ ఆన్‌లైన్‌లో విద్యార్థుల పేర్లు కనిపించడం లేదు. దాంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆ ఐదుగురు విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించలేని పరిస్థితి ఎదురైంది. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జెఏసీ ఛైర్మన్ హనుమంతు సాయిరాం, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథరావు, డీడీఎఫ్ జిల్లా కార్యదర్శి పేడాడ కృష్ణారావు, మిస్కా కృష్ణయ్య, దళిత సంఘాల నాయకుడు డి.గణేష్, కల్లేపల్లి రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై జర్నలిస్టుల నిరసన



అరసవల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో టూరిస్టులపై ఉగ్రదాడిని నిరసిస్తూ నగరంలో సోమవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరరావు, కుంచె చిన్నారావు, కె.రామారావు, ఎస్.నవచైతన్య, చౌదరి సత్యనారాయణ, నాగభూషణం, భాస్కరరావు, కల్యాణ చక్రవర్తి, శ్రీరాములునాయుడు, తిరుమలరావు పాల్గొన్నారు.

సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరించండి



ధర్నా చేస్తున్న సీహెచ్‌ఓలు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ అధికారుల(సీహెచ్‌ఓ)ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలో గల మహాత్మా జ్యోతిరావు పూలే పార్కు వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు ఎం.ఉషారాణి మాట్లాడుతూ సిహెచ్‌ఓలుగా 6 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. జాతీయ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన పెంపుదలను అమలు చేయాలని, ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్టమైన జాబ్ ఛార్టు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సోమావరం నుంచి విధులను బహిష్కరిస్తున్నామని తెలిపారు. కానీ ఎమర్జెన్సీ సేవల్లో మాత్రం అందుబాటులో ఉంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పి.ఇందుమతి, ఉపాధ్యక్షులు డి.శ్రావణి, సీహెచ్ జ్యోతి, జిల్లా అడ్వైజర్ రాజీవ్, ఈసీ సభ్యుడు విశ్వనాథ్, జిల్లా నలుమూలల నుంచి సుమారు 100 మంది సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

జీపు జాతాను విజయవంతం చేయండి

ఎచ్చెర్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న జీపు జాతాను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.నారాయణరావు, పి.చంద్రరావులు కోరారు. ఈ మేరకు సోమవారం వివిధ గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. వచ్చే నెల 2న పూడివలస జంక్షన్ నుంచి జీపు జాతా ప్రారంభమై సోంపేట వరకు కొనసాగుతుందన్నారు. నారాయణపురం కుడి కాలువ ద్వారా సాగునీరు సక్రమంగా అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నేతలు కొత్తకోట అప్పారావు, గొల్లపల్లి శ్రీరామ్మూర్తి, కొత్తకోట అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం' సమస్యలను తక్షణమే పరిష్కరించండి: కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వచ్చిన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమంలో ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 165 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి... వాస్తవ పరిస్థితిని పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒక సమస్యను పరిష్కరించకపోతే... అది మరింత పెద్ద సమస్యగా మారుతుందని అధికారులు గమనించాలన్నారు. ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యాంశంగా తీసుకొని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని.. సాధ్యం కాకపోతే ఫిర్యాదుదారులకు స్పష్టమైన వివరణ ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారంలో కొన్ని శాఖలు వెనుకబడి ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి సమస్యపై వేగంగా స్పందించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఉప కలెక్టర్ పద్మావతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు స్మార్ట్‌ఫోన్లు

స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీకోసం' వినతుల స్వీకరణ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా ఐదుగురు బధిరులకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్మార్ట్‌ఫోన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఏడీ కవిత తదితరులు పాల్గొన్నారు.

మా భూమి ఇప్పించండి

అతనో వృద్ధుడు. పేరు కుప్ప వెంకటరావు. అతని పేరున 55 సెంట్ల భూమి వేర్వేరు సర్వే నెంబర్లలో రణస్థలం మండలం జేఆర్‌పురం జాతీయ రహదారికి ఆనుకొని ఉందని చెబుతున్నాడు. ఆ భూములపై అక్రమార్కుల కన్ను పడిందని... తాను భూమిని అమ్మనని తెలిసి... దాయాదులతో కలిసి దొంగ పత్రాలు సృష్టించి... వారి పేరున రిజిస్ట్రేషన్ చేయించేశారని ఆరోపించాడు. దీనికి నిజమైన హక్కుదారుడునని చెబుతున్న కుప్ప వెంకటరావు తన భూమిని ఇప్పించాలని కోరుతూ కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో సోమవారం వినతిపత్రాన్ని అందించాడు. ఇప్పటికే రెండుసార్లు గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించానని, కానీ సరైన చర్యలు తీసుకోలేదని వాపోయాడు.



వెంకటరావు

స్థలం ఆక్రమించారని...

అతను 70 ఏళ్ల వృద్ధుడు. అంతకు మించి పూర్తిగా చూడలేని అంధుడు. తన ఇంటి పెరటిలోని స్థలంలో బాత్‌రూమ్ కట్టుకునేందుకు కొద్దిపాటి స్థలం ఖాళీగా ఉంచుకున్నాడు. వారితో ఎటువంటి సంబంధం లేని వ్యక్తి ఆ స్థలాన్ని ఆక్రమించుకుని, అడిగినందుకు దౌర్జన్యానికి పాల్పడ్డాడని వృద్ధుడు ఆరోపిస్తున్నాడు. సోమవారం గ్రీవెన్స్‌కు వచ్చి.. తన స్థలాన్ని ఇప్పించాలని, ఆక్రమణదారుని నుంచి రక్షణ కల్పించాలని కలెక్టర్‌ను వేడుకున్నాడు. ఇదీ కోటబొమ్మాళి మండలం వాండ్రాడ గ్రామానికి చెందిన వాకాడ త్రిమూర్తి పరిస్థితి.



వాకాడ త్రిమూర్తి

బతకడానికి సాయం చేయండి..

'నాకు 42 ఏళ్లు. వివాహమైంది. ఇద్దరు పిల్లలు. కానీ వారు దీర్ఘకాలంగా పార్కిన్‌సన్ వ్యాధితో బాధపడుతున్నారు. అదే వ్యాధితో నా ఇద్దరు పిల్లలు మరణించారు. భార్య కూడా నాతో పాటు అదే వ్యాధితో బాధపడుతోంది. పని చేసేందుకు శరీరం సహకరించని పరిస్థితి. మంచంపైనే గడపాల్సిన దుస్థితి. దయచేసి హెల్త్ పింఛను ఇప్పించి ఆదుకోండి ...కలెక్టర్ గారూ' అంటూ ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడు పేటకు చెందిన ఢిల్లీశ్వరరావు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాడు.



ఢిల్లీశ్వరరావు కుటుంబ సభ్యులు

చిన్నపిల్లలకు న్యాయం చేయండి

'కుమార్తెకు పెళ్లి చేసి... అత్తవారింటికి పంపేశాను. వారికి ఇద్దరు పిల్లలు. కానీ నా అల్లుడికి మిత్రునిగా నటించిన నాని అనే వ్యక్తి నా కుమార్తెను మాయచేసి తీసుకుపోయాడు. అల్లుడు నిరాశతో ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. ఇద్దరు చిన్నపిల్లలతో ఏం చేయాలో తెలియడం లేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. నాకు వచ్చే రూ.4వేల పింఛనుతోనే అద్దె ఇంట్లో దుర్భరంగా జీవనం గడుపుతున్నాను. నా కుమార్తె ఎక్కడ ఉందో తెలియడం లేదు. ఆమెను తీసుకువెళ్లిన నాని అనే వ్యక్తి ఏ వివరాలు చెప్పడం లేదు సరికదా, నన్ను బెదిరిస్తున్నాడ'ని నగరంలోని బలగ మెట్టు ప్రాంతానికి చెందిన వృద్ధురాలు గ్రీవెన్స్‌లో సోమవారం దీనంగా విలపించింది. చిన్నపిల్లలకు న్యాయం చేయాలని, తన కుమార్తె ఆచూకీ తెలపాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది.

మహిళల అభ్యున్నతే ధ్యేయం: ఎమ్మెల్యే



రణస్థలంలో కుట్టుశిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు(ఎన్ఈఆర్) అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీసీ మహిళల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం చేయూతనిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న కుట్టు మిషన్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు ఇంటి వద్దనే ఉంటూ ఆర్థిక అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. రైతు సేవా కేంద్రం సమీపంలో నిర్మించిన పశువుల నీటి తొట్టెను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, వజ్జిపర్తి రఘురాం, మజ్జి కన్నంనాయుడు, కూర్మారావు, ఈశ్వర రావు, సురేష్‌,ఇ్రోపీడీవో జి.రామకృష్ణ, తహసీల్దారు ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి సాయపడాలి

రణస్థలం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది.. కుటుంబానికి సాయపడాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. 90 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం. ఈశ్వరరావు, కూటమి నేతలు లంక శ్యామలరావు, డీజీఎం ఆనందరావు, పిన్నింటి భానోజీనాయుడు, దన్నాన మహేశ్వరరావు, జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళలకు చేయూత

లావేరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణతో మహిళలకు చేయూతనిస్తున్నామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. సోమవారం లావేరు మండల కేంద్రంలో మహిళలకు కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 103 కుట్టు మిషన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ప్రతి మహిళ అభివృద్ధి చెందాలనేది సీఎం చంద్రబాబునాయుడు ఆలోచనని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ తోటయ్యదొర, ఏపీఎం సుబ్బయ్యనాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్



పాఠ్యపుస్తకాలను భద్రపరుస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 28 ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మండల స్టాక్ పాయింట్‌కు పాఠ్యపుస్తకాలు చేరాయి. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా ర్థి మిత్రలో భాగంగా మొదటి విడతగా 32,162 పాఠ్యపుస్తకాలు స్టాక్ పాయింట్‌కు చేరాయని ఎంఈఓలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం తెలిపారు. త్వరలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికోద్యమాలను అడ్డుకోవడం ఎవరితరం కాదు

అరసవల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు సిఐటీయూపై అక్కసు వెళ్లగక్కారని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు కె.నాగమణి అన్నారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికోద్యమాలను అడ్డుకోవడం ఎవరితరం కాదని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. కార్మికుల పక్షాన నిజాయితీతో పోరాడే కార్మిక సంఘం సిఐటియు అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఆదినారాయణమూర్తి, ఎన్‌వి రమణ, అల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి ఎంఆర్ కిట్

పొందూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పొందూరులోని భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థి గేదెల దేవేంద్రకి జిల్లా విద్యా శాఖాధికారి తిరుమల చైతన్య, ఎస్ఎస్ఏ ఏపీసీ శశిభూషణ్ ఎంఆర్ కిట్‌ను సోమవారం జిల్లా కేంద్రంలో అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహితవిద్య కో-ఆర్డినేటర్ బి. గోవిందరావు, దినేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలి: ఎన్‌ఎంయూ

అరసవల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో దీర్ఘకాలంగా నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వై. అప్పయ్య మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల యాజమాన్య వ్యతిరేక వైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా 129 డిపోలలో, నాన్-ఆపరేషన్ యూనిట్లలో డిమాండ్లతో కూడిన నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల భద్రతా సర్క్యులర్ 1/2019ను వెంటనే అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులను వెంటనే కల్పించాలని, గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణకు సెలవులు మంజూరు చేయాలని, అనారోగ్య సెలవుల్లో పూర్తిజీతం చెల్లించాలని డిమాండ్ చేశార ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వి.డి.రావు, ఎం.ఎస్.రావు, ఎం.ఆర్.మూర్తి, జోనల్ సెక్రటరీ బి.ఎస్.రాములు, కె.నరసింహులు, చలం, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 58 వినతులు

శ్రీకాకుళం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 58 వినతులు అందజేశారు. అదనపు ఎస్పీ శ్రీనివాసరావు అర్జీదారులతో నేరుగా మాట్లాడి.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి నుంచి రాతపూర్వక ఫిర్యాదులను స్వీకరించారు. అన్ని పోలీసు స్టేషన్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు, ఎస్ఐలకు ఫోన్ చేసి.. గ్రీవెన్స్‌కు అందే వినతులపై సకాలంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేర నియంత్రణకు డ్రోన్ నిఘా..

నగరంతో పాటు చుట్టుపక్కల నిర్మానుష్య ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు నిఘా పెంచారు. డ్రోన్‌లతో ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని వాంబే కాలనీ, డచ్ బంగ్లా, పొన్నాడ వంతెన, నాగావళి నదీ పరీవాహక ప్రాంతాలు, పట్టణ శివారు ప్రాంతాల్లో వీడియోలు చిత్రీకరించారు.

శక్తి యాప్‌పై అవగాహన...

మహిళలు, బాలికలు, యువతుల సంరక్షణ కోసం శక్తి యాప్ వినియోగించుకోవాలని పోలీసులు కోరారు. శ్రీకాకుళం బస్ స్టేషన్, శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్, అన్ని వార్డులలోనూ శక్తి యాప్ వినియోగంపై ప్రజలకు.. ముఖ్యంగా మహిళలకు పోలీసులు అవగాహన కల్పించారు. మహిళల వద్దకు వెళ్లి.. వారి ఫోన్లలో శక్తియాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్షణ కోసం డయల్ 112, ఎస్ఓఎస్ బటన్‌ను వినియోగించడంపైనా అవగాహన కల్పించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

హరిపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మందస మండలం గొల్లలపాలెం గ్రామానికి చెందిన నర్తు గున్నమ్మ(80) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దకుమారుడి వద్ద ఉంటున్న గున్నమ్మ కొన్నాళ్లగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన గున్నమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగడం అపస్మారక స్థితికి వెళ్లింది. కుటుంబ సభ్యులు గమనించి గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుణ్ని పిలిపించి చూపించగా.. అప్పటికే మృతి చెందింది. పోలీసులకు సమాచారం అందగా కేసు నమోదు చేస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

టెక్కలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అక్కవరం గ్రామానికి చెందిన నెయ్యిల జోగారావు(45) విశాఖ జిల్లా ఆనందపురం వద్ద అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు అతడి భార్య నీలవేణి ఆరోపిస్తున్నారు. ఉపాధి కోసం ఆనందపురంలోని ఓ రైస్‌మిల్లులో డ్రైవర్‌గా పనిచేసేందుకు వెళ్లిన తన భర్త శవమైవస్తాడని అనుకోలేదని ఆమె రోధిస్తుంది. రెండురోజుల కిందట నీ భర్త మద్యం తాగుతున్నాడని, పనికి కూడా రావడం లేదని, తీసుకుపోవాలని తనకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారని, తిరిగి 48గంటల్లో తన భర్త మృతదేహాన్ని ఇంటికి పంపారని నీలవేణి ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త మృతిపై అనుమానం ఉందని ఆమె సోమవారం టెక్కలి పోలీసులను ఆశ్రయించారు. అయితే కొంతసేపు టెక్కలి పోలీసులు తడబాటుకు గురైనా చివరకు గ్రామస్థులు, మృతుడి భార్య ఒత్తిడి మేరకు జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. కాగా జోగారావుకి ఇద్దరు కుమారులు ఉన్నారు.

గొడ్డలితో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడిన సంతోష్‌కుమార్

సంతబొమ్మాళి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నౌపడకు చెందిన దుక్క సంతోష్‌కుమార్‌పై అదే గ్రామానికి చెందిన జీరు శంకర్‌రెడ్డి సోమవారం రాత్రి గొడ్డలితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. నౌపడ పోలీసులు, స్థానికుల తెలిపిన వివరాల మేరకు.. దుక్క రమేష్ స్నానం చేస్తుండగా ఆ నీరు జీరు శంకర్‌రెడ్డి ఇంటి ముందుకు వెళ్లడంతో గొడవ ప్రారంభమైంది. ఇది వారి మధ్య వాగ్వాదం జరుగుతున్న సమయంలో రమేష్ అన్న కుమారుడు సంతోష్‌కుమార్ వచ్చి ఇరువురికి నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. మద్యం మత్తులో ఉన్న శంకర్‌రెడ్డి తన ఇంట్లో ఉన్న గొడ్డలి తీసుకువచ్చి సంతోష్‌కుమార్‌పై దాడి చేయడంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. గాయపడిన సంతోష్‌కుమార్‌కు నౌపడ పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన శంకర్‌రెడ్డి పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నౌపడ పోలీసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్టు

లావేరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమడాం గ్రామానికి చెందిన గుండు ఆదినారాయణను హత్యాయత్నం కేసులో సోమవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 26వ తేదీ రాత్రి ఆదినారాయణతో పాటు నాగంపాలెం గ్రామానికి చెందిన కెల్ల సత్యనారాయణ, రామారావు కలిసి రావాడ జంక్షన్‌లో మద్యం తాగారు. అనంతరం ఆటోతో తమ ఇళ్లకు చేరే సమయంలో సత్యనారాయణపై ఆదినారాయణ చాకుతో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. వీరిని విడిపించేందుకు ప్రయత్నించిన కెల్ల రామారావును చాకుత్ గాయపరిచాడు. వీరిరువురి మధ్య గతంలో ఉన్న పాతకక్షలే కారణమని ఎస్ఐ తెలిపారు. సత్యనారాయణ, రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదినారాయణపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

గంజాయితో ముగ్గురు పట్టివేత


పట్టుబడిన నిందితులతో రైల్వే ఎస్ఐ షరీఫ్, సిబ్బంది

పలాస, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పలాస రైల్వేస్టేషన్‌లో తమిళనాడు రాష్ట్రం మధుర నార్త్‌బ్లాక్, వాగైకులం గ్రామానికి చెందిన జె.శ్రీధర్, ఒడిశా రాష్ట్రం, గజపతి జిల్లా మార్లాబా గ్రామానికి చెందిన శ్యాముల్‌కరాడ్, అదే రాష్ట్రం అంగూరు గ్రామానికి చెందిన రింకు బిరో రెండు బ్యాగుల్లో 8.800 కిలోల గంజాయి తరలిస్తుండగా రైల్వే పోలీసులకు పట్టుబడ్డారు. రైల్వే ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి 10గంటల ఆ ముగ్గురూ గంజాయితో తమిళనాడు వెళ్లేందుకు టిక్కెట్లు తీసుకున్నారు. వీరిపై ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు వేర్వేరు ప్రాంతాల్లో రైలుకోసం వేచి చూస్తున్నారు. ఇదే సమయంలో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు వారిని ప్రశ్నించడంతో తప్పించుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు అప్రమత్తమైన వారిని పట్టుకున్నారు. వారి బ్యాగులు పరిశీలించగా గంజాయి బయట పడింది. మధ్యవర్తుల సమక్షంలో పంచనామా నిర్వహించి విశాఖ రైల్వేకోర్టులో హాజరు పరిచి సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడి

సోంపేట/హరిపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు చేశారు. మందస మండలంలోని పట్టులోగాంలో సారా తయారీ కోసం ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సోంపేట మండలం కొరంజిభద్ర గ్రామానికి చెందిన ఎస్.రాము, బాతుపురం గ్రామానికి చెందిన డీ.కేశబో, చిన్నకోస్టా గ్రామానికి చెందిన ఎస్.కొమండో 80 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకొని అరెస్టు చేసినట్లు సీఐ కె.బాబీ తెలిపారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపై ఫిర్యాదు

పొందూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.వెంకటరావుపై పీఎంసీ మాజీ ఛైర్మన్ గట్టెం హేమలత (రాధ) సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో పాఠశాలలో నాడు-నేడు పనులు చేసినా బిల్లులు మంజూరు కాకపోవడంతో నిర్మాణానికి సంబంధించిన రూ.2.50 లక్షలు విలువ చేసే సామగ్రి నిర్మాణం చేసిన గదిలో ఉంచి తాళాలు వేశామని, బకాయి బిల్లులు మంజూరైన గదిని అప్పగిస్తామని అధికారులకు గతంలో తెలియజేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే హెచ్ఎం వెంకటరావు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే, బిల్లులు మంజూరు కాకుండానే గది తాళాలు విరగగొట్టి అందులో ఉన్న సామగ్రి మాయం చేశారని, అడిగితే నిర్లక్ష్యంగా, అసభ్యకరంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎస్ఐ వి. సత్యనారాయణ హెచ్ఎంను పిలిపించి విచారించారు.

మేడేను విజయవంతం చేయండి

టెక్కలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు నంబూరు షన్ముఖరావు అన్నారు. ఆదివారం టెక్కలిలో కార్మిక దినోత్సవానికి సంబంధించి కరపత్రాలను ప్రదర్శించారు. మే 1వ తేదీ గురువారం ఉదయం 9గంటలకు టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు కార్మికులు అందరూ చేరుకొని అక్కడ నుంచి ప్రదర్శనగా శంభానవీధిలో గల సీఐటీయూ కార్యాలయానికి చేరుకోవాలన్నారు.

ఈదురుగాలులతో వర్షం



పాతపట్నంలో కురుస్తున్న వర్షం

జలుమూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. రబీ వరిధాన్యం కల్లాల్లో ఉండడంతో వాటిని భద్రపరచుకోడానికి రైతులు అష్టకష్టాలు పడ్డారు. పగలంతా ఎండ తీవ్రంగా ఉండగా.. సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. ఈదురు గాలుకు మామిడి కాయలు నేలరాలి నేలరాలాయి.

● పాతపట్నం: పాతపట్నంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలలతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఠారెత్తించిన ఎండలతో ప్రజలు ఉక్కిరి బిక్కిరయ్యారు. సాయంత్రానికి ఒక్కరిగా వాతావరణం మారి వర్షం కురిసింది. పలు వీధుల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందిపడ్డారు. కాగా పాత తహసీల్దార్ కార్యాలయ చేరువలో చెట్టు కొమ్మ విరిగి విద్యుత్‌లైన్‌పై పడడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో రాత్రి 9.30 వరకూ విద్యుత్ లేకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందిపడ్డారు.


మెళియాపుట్టిలోకురుస్తున్న వర్షం

● మెళియాపుట్టి: మండలంలో పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం సోమవారం సాయంత్రం కురిసింది. కొద్దిరోజులుగా ఎండలు ఠారెత్తిస్తున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. ఈదురుగాలులకు మామిడి పంటకు నష్టం వాటిల్లింది.

● నరసన్నపేట: మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలు, ఉరుములతో వర్షం కురిసింది. దీంతో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. జమ్ము, రావాడపేట, పొన్నానపేట, మాకివలస, కోమర్తి, కిళ్లాం తదితర గ్రామాల్లో ఉన్న అరటి, మామిడి పంటకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జలుమూరు: ధాన్యం రాశులపై కప్పిన టార్పాలిన్లు

● పలాస రూరల్: మండలంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన చిన్నపాటి వర్షంతో ప్రజలు ఉపశమనం చెందారు. ఉదయం నుంచి ఠారెత్తిన ఎండ, వేడిగాలులతో అల్లాడిన ప్రజానీకానికి సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షం కొంత ఊరటనిచ్చింది

● ఎల్ఎన్ పేట: మండలంలో సోమవారం సాయంకాలం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం తీవ్రంగా ఎండ కాయడంతో వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురవడంతో వారంతా ఉపశమనం పొందారు.

● నందిగాం: మండల పరిధిలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు పడ్డాయి. ఉదయమంతా ఎండ త్రీవంగా ఉండగా... సాయంత్రానికి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చాయి. దీంతో రెండురోజులుగా కాసిన ఎండలను నుంచి మండల ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

● కొత్తూరు: మండలంలో సోమవారం సాయంత్రం ఈదుర గాలులతో కూడిన వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా వేసవి తాపానికి అల్లాడుతున్న ప్రజలకు సోమవారం కురిసిన వర్షం చల్లదనాన్ని ఇచ్చింది. ఎండ తీవ్రతకు అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది.

డీ పట్టా భూముల్లో.. 40 మంది నకిలీలు

● జగతిమెట్ట ఇళ్ల కాలనీలో బయటపడుతున్న అక్రమాలు
● ఒకే వీఆర్‌వో పోర్జరీ సంతకాలతో ఎనిమిది పట్టాలు జారీ చేసినట్లు గుర్తింపు
● ఆర్డీవో కృష్ణమూర్తి


మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జగతిమెట్ట ఇళ్ల కాలనీ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్న కొలదీ అప్పటి రెవెన్యూ సిబ్బంది అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'జగతిమెట్ట ఇళ్ల కాలనీలకు సంబంధించి డీ పట్టా రైతుల నుంచి ల్యాం డ్‌ఎక్విజేషన్ చేసినవారిలో 30మంది రైతులైతే.. అప్పటి రెవెన్యూ సిబ్బంది 70మంది పేర్లు సృష్టించి అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించాం. 40 మందికి నకిలీ పట్టాలిచ్చినట్టు తేలింది. వాస్తవానికి ల్యాండ్‌ఎక్విజేషన్‌లో డీ పట్టా తీసుకున్న రైతులకు ఒక్కొక్కరికి ఒక టిన్నర సెంట్లు కేటాయించాలి. కానీ కొంతమంది రెవెన్యూ సిబ్బంది నిబం ధనలు తుంగలో తొక్కి అనర్హులకు సైతం పట్టాలు జారీ చేశారు. ఈ వ్యవహారంలో వీఆర్‌వో ఎస్.వైకుంఠరెడ్డి అంతా తానై.. తహసీ ల్దార్ మొదలుకొని రెవెన్యూ సిబ్బంది సంతకాలు ఫోర్జరీ చేసి ఎనిమిది మందికి పట్టాలు జారీచేసినట్లు ప్రాథమికంగా గుర్తించాం. చింతాడ విజయ్‌కుమార్(పట్టా నెం.288), పట్నాన సరోజినమ్మ (పట్టా:300), కంటా సంతోషమ్మ (పట్టా:301), పట్నాన రత్నాలు(పట్టా:303), పట్నాన సుహాసిని(పట్టా:304), తొగరాన వరలక్ష్మి(పట్టా:307).. ఇలా పలువురికి తప్పుడు పట్టాలతో విక్రయించారు. ఆ సర్వే నెంబర్లలో 388మందికి మాత్రమే పట్టాలు ఇవ్వాల్సి ఉండగా, మరికొందరు వీఆర్‌వోలు ఐదుకు తక్కువ లేకుండా పట్టాలు సృష్టించి అనర్హులకు పంపిణీ చేశారు. అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ సిబ్బంది ఎంతటివారైనా సస్పెన్షన్ చేసేందుకు చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.

200 రోజులుగా..


కోటబొమ్మాళిలో అన్న క్యాంటీన్

కోటబొమ్మాళి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత నిధులతో మండల కేంద్రంలో గల ఎన్టీఆర్ భవన ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ సోమవారం నాటికి 200 రోజులు పూర్తి చేసుకుంది. రోజుకు 200మందితో ప్రారంభమైన ఈ అన్న క్యాంటీన్ క్రామేపి పెరుగుతూ ప్రస్తుతం ప్రతి రోజూ 400మంది పేదవారి ఆకలి తీర్చుతుంది. ఇక్కడ భోజనం చేస్తున్నవారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా లాడి శ్రీనివాస్ పర్యవేక్షిస్తున్నారు.

బెండిగేటు-నువ్వలరేవు రోడ్డు పనులు పూర్తి చేయండి

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి ప్రధాన రహదారి అయిన బెండిగేటు- నువ్వలరేవు ఆర్అండ్‌బీ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆటో యూనియన్, సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మోహనరావు, ఆటో యూనియన్ నాయకులు రాజు మాట్లాడుతూ.. ఉన్న రోడ్డును విస్తరణ పేరుతో ఇరువైపులా తవ్వి గ్రావెల్ వేసి వదలివేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఈ రోడ్డు మరమ్మతులకు చేపట్టాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సీతారామయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘ నాయకులు బి.ఆనందరావు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.గణపతి ఉన్నారు.

'వన్ నేషన్ - వన్ ఎలక్షన్'పై సెమినార్

టెక్కలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో స్టూడెంట్ ఫర్ వన్‌నేసన్, వన్ ఎలక్షన్‌పై నిర్వహించిన సెమినార్‌లో జిల్లా నుంచి బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్ర చక్రవర్తి పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఒకే దేశం.. ఒకే ఎన్నికలు ప్రజాస్వామ్య ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు సరైన మార్గమన్నారు. ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల వ్యయాన్ని తగ్గిస్తూ అన్ని రాష్ట్రాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

ఐసీడీఎస్ కేంద్రాల పరిశీలన


బాలింతతో మాట్లాడుతున్న నాగాలాండ్ అధికారులు

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సుపోషితా పంచాయతీగా ఎంపికైన దేవునల్తాడ ఐసీడీఎస్ కేంద్రాన్ని నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన సోషల్ వెల్ఫేర్ అధికారుల బృందం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై స్థానిక అధికారులు నుంచి వివరాలు సేకరించారు. పిల్లలు బరువులు, ఎత్తులు తనిఖీలు చేసి పోషణ స్థాయిపై ఆరాతీశారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతూ వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి ఝాన్సీ, కాశీబుగ్గ ఐసీడీఎస్ పీవో కె.పార్వతి, జిల్లా కోఆర్డినేటర్ శివాజీ, జిల్లా బీపీసీ మహేష్, సెక్టర్ సూపర్‌వైజర్ ఆర్.ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

రిలే నిరాహార దీక్షలు ప్రారంభం


రిలేదీక్షలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

పలాస, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక డిపో కార్యాలయం ఇన్‌గేట్ వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్షలు సోమవారం ప్రారంభించారు. సంఘ నాయకులు ఎంజే దేవ్, ఎస్.పార్వతీశం, ఏపి నాయుడు మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్.అంజనేయులు, ఎస్.పార్వతీశం, టి.లక్ష్మణరావు, టి.శ్రీనివాసులు, ఎన్ఎన్.కుమార్, ఎస్‌పి.కుమార్‌లు పాల్గొన్నారు.

'కేంద్రీయ విద్యాలయంపై విషం చిమ్మారు'

పలాస, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసి వేలాది మంది విద్యార్థులకు సెంట్రల్ సిలబస్ అందించాలనే యోచనలో ఎమ్మెల్యే శిరీష, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఉంటే వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు దీనిపై విషం చిమ్ముతున్నారని ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ ఆరోపించారు. ఎంతో సదాశయంతో కేంద్ర విద్యను పలాసలో ఉన్న పేదలకు అందించాలనుకుంటే మాజీ మంత్రికి రుచించడం లేదని దుయ్యబట్టారు. ఇకనైనా బుద్ధి తెచ్చుకొని కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. వీరి వెంట పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి సప్ప నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, ఎం.నరేంద్ర(చిన్ని), గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్‌గుప్తా, గురిటి సూర్యనారాయణ, దడియాల నర్సింహులు, జోగ మల్లి, యవ్వారి మోహనరావు, మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సర్వేకు పోలీసు బందోబస్తు కోరిన తహసీల్దార్

కొత్తూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం మెట్టూరు బిట్-1 వంశధార నిర్వాసిత కాలనీలో సర్వే చేసేందుకు పోలీసుల ఎస్కార్ట్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్ నారాయణరావు తెలపారు. నిర్వాసిత కాలనీలో ప్రభుత్వ రిజర్వు స్థలాలు ఆక్రమణ, ఒక్కోక్కరికి రెండు చోట్ల పట్టాలు పొంది ఉన్నారని గ్రామస్థులు, జిల్లా కలెక్టర్‌కు, టెక్కలి ఆర్డీవోకి ఫిర్యాదు చేయడంతో నిర్వాసిత కాలనీలో ఇంటింటా సర్వే చేసి నివేదిక అందజేయాలని రెండు నెలలు క్రితమే ఆర్డీవో ఆదేశించారు. దీనితో నిర్వాసిత కాలనీలో సర్వే చేసేందుకు నాలుగు బృందాలు 8మంది సిబ్బందిని నియమించారు. ఐదు రోజుల్లో నివేదిక అందజేయాలని ఈనెల 11న అప్పటి తహసీల్దార్ రవిచంద్ర ఉత్వర్వులు జారీ చేసినా ఎటువంటి సర్వే చేయలేదన్నారు. దీనితో గ్రామస్థులు పదేపదే సర్వే చేయాలని పట్టుబడుతుండడంపై ఆర్డీవో ఆగ్రహించి సర్వే టీమ్‌కు మెమో జారీ జారీ చేశారు. బిట్-1లో సర్వే సమయంలో ఎటువంటి తగాదాలకు తావివ్వకుండా ఉండేలా ముందుస్తుగా పోలీసులు సమాచారం అందించి సర్వేకు వెళ్లేందుకు రంగం సిద్ధం చేసినట్టుతత ఆయన తెలిపారు. ఆర్డివో ఆదేశాలతో మండల రెవెన్యూ యంత్రాంగ కదలటమే కాకుండా సర్వే టీమ్‌కు మెమోలు జారీ చేయటంతో సర్వే బృందం ఆందోళన చెందుతున్నారు.

రూ.20 లక్షలతో మైనర్ ఇరిగేషన్ పనులు

హిరమండలం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్ట గ్రామం పరిధిలో మైనర్ ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు సుమారు రూ.20 లక్షలు ప్రభుత్వ మంజూరు చేసింది.గ్రామం సమీపంలోని తంపర బట్టి చెక్ డ్యామ్,ఏటిబట్టి చెక్ డ్యామ్,గొట్ట గ్రామంలో చెరువు మదుములు,మరమ్మతు పనులకు ఈ నిధులు కేటాయించడం జరుగుతుందని ఇరిగేషన్ ఏఈ ప్రసాదరావు చెప్పారు. ఈ మేరకు పనులు చేపట్టేందుకు సోమవారం చెరువు,ఊటబట్టి సర్వే నిర్వహించారు.

లోక్‌అదాలత్ వాయిదా

పాతపట్నం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 10వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను జూలై 5 తేదీకు వాయిదా పడినట్లు పాతపట్నం జూనియర్ సివిల్ న్యాయాధికారి మండల న్యాయసేవసంఘం అధక్షురాలు మానెం రోషిణి తెలిపారు. రాష్ట్రన్యాయసేవ అధికారసంస్థ ఆదేశాల మేరకు ఈ వాయిదా పడినట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయవాదులు కక్షిదారులు అధికారులు గమనించి సంబంధిత చర్యలు చేపట్టి ఎక్కువ కేసుల రాజీకి ప్రయత్నించాలన్నారు.

తాగునీరు సరఫరా


తాగునీరు అందిస్తున్న దృశ్యం

పాతపట్నం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మేజర్‌పంచాయతీ పాతపట్నంలోని నీలకం ఠాపురం బాలాజీనగర్ వీధుల్లో ట్యాంకర్‌లతో తాగునీటి సరఫరాను టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ సోమవారం ప్రారంభించారు. ఆయా వీధుల్లో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉండడం వల్ల టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి మామిడి అప్పారావు మెమోరియల్‌ట్రస్ట్‌ద్వారా ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి ట్యాంకర్‌తో తాగునీటి సరఫరాను సోమవారం నుంచి చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్ష కార్యదర్శులు సైలాడ సతీష్, అక్కుంద్ర సన్యాశిరావు సర్పంచ్‌ప్రతినిధి సిర్ల జోగారావు పంచాయతీఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి మహాసింగిలో ఉత్సవాలు

కొత్తూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కర్లెమ్మ పంచాయతీ మహాసింగి గ్రామంలో కంతల గెడ్డ సమీపంలో ఉన్న వరహాలక్ష్మినారసింహ పురాతన దేవాలయం వచ్చే నెల 8వ నుంచి 10వ తేదీ వరకు ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం స్థానిక సర్పంచ్ ఎల్.భగవాన్‌దాస్ నాయుడు, ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలే ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోగుల వరప్రసాదరావు, చోడవరపు రాము, పొగిరి రవి, యిప్పిలి జానకిరామయ్య, కొత్తూకోట నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సంస్థాగత కమిటీల ఎన్నిక

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత కమిటీల నియామకం మండలంలో చేపట్టారు. కొత్తపేట పంచాయతీ సంబంధించి అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా గోవిందు జానకీ, ఉపాధ్యక్షులుగా బైపిల్లి లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కంబాల రాంబాబు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పెరుముళ్ల సాయి, యంపల్ల కుమార్, గుంటు సింహాచలం, గ్రామ కార్యదర్శులుగా గోవిందు రామయ్య, మరుపల్లి జ్యోతి, కారి వెంకటస్వామి, కోశాధికారిగా కొండ ఎర్రయ్య, తెలుగు యువత గనగల్ల దిలీప్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, బీసీ సెల్ గోవిందు పాపారావు తదితరులు ఉన్నారు.

పట్టాలు మంజూరు చేయాలి

సంతబొమ్మాళి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మేఘవరం తంపర భూములపై మత్స్యకారులకు పట్టాలు మంజూరు చేయాలని మత్స్యకార, టీడీపీ నాయకులు సూరాడ ధనరాజ్, ఎంపల్లి జోగారావు కోరారు. సోమవారం మండల స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ హేమసుందరరావుకు వినతిపత్రం అందజేశారు.

ఆలయ వార్షికోత్సవం

సంతబొమ్మాళి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వడ్డివాడలో వీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త బోడాల షన్ముఖ శాంతారావు తెలిపారు. మూడు రోజులపాటు తిరు కల్యాణం స్వామి వత్రాలు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జలుమూరు (సారవకోట), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సారవకోట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గల 11కేవీ అలుదు ఫీడర్‌లో మరమ్మతులు చేపట్టనుండడం వల్ల మంగళవారం ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్టు టెక్కలి ఈఈ జి.శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో సారవకోట, గొర్రిబంద, అలుదు, కుమ్మరిగుంట, అడ్డపనస, అర్లి, బురుజువాడ, గుజ్జువాడ, అన్నుపురం, వాండ్రాయి, బెజ్జి, బురద కొత్తూరు, అంగూరు, కేశ్లవలస, సత్రాం తదితర గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

పోలాకి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శివారుగ్రామాలైన పిన్నింటిపేట, రహిమాన్‌పురం, వనవిష్ణుపురం, రేగుపాడు, బార్జిపాడు తదితర ముఖ్య కూడలిల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ రంజిత్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అత్యాధునికి సాంకేతికతను ఉపయోగించి వీటిని పోలీసు స్టేషన్‌కు అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేశామన్నారు. అమ్మవారి సంబరాలు, జాతరల్లో లాటరీ, జూదం అట్టలు వేసి చర్యలు తప్పవన్నారు. ఏదైనా సమాచారం ఉంటే 6309 990849 ఫోన్ నెంబరుకు తెలియజేయాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

వలసలు నివారించండి

టెక్కలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సరైన ఉపాధి లేక ఈ ప్రాంత ప్రజలు ఇతర జిల్లాల వైపు ఉపాధి కోసం వలసలు పోతున్నారని, శాశ్వత వలసలు నివారణకు చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు హనుమంతు ఉదయ్ భాస్కరరావు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరారు. జిల్లాలో సూక్ష్మస్థాయి నుంచి శాస్త్రీయ బద్ధమైన సర్వే నిర్వహించి వివిధ వృత్తుల్లో నిపుణులను గుర్తించి సముచితమైన పద్ధతిలో అంకూర్ సంస్థలు నెలకొల్పవచ్చున్నారు. ఈ సర్వేకు సంబంధించి డీపీఆర్‌కు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. నాగభూషణం ఉన్నారు.

న్యాయం చేయండి

నందిగాం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పాలవలస గ్రామానికి చెందిన తుంగాన దమయంతి న్యాయం చేయాలని అధికారులకు మొరపెట్టుకుంది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ నరేంద్రపురం సరిహద్దులో ఉన్న తన జీడితోట దగ్ధమైందని, దీంతో పంటను కూడా కోల్పోయానని, భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నందున దగ్ధమైన తోటకు సాయం అందించాలని కోరింది.

వెయ్యి ఎకరాల్లో కల్యాణి స్టీల్స్

(ఐదో పేజీ తరువాయి)

భావిస్తున్నారు. ఈ మేరకు శనివారం పూణే నుంచి కల్యాణి స్టీల్స్ సంస్థ హెచ్ ఆర్ సింగ్‌తో పాటు లాజిస్టిక్ మేనేజర్, ఇతర నిపుణులు.. రెవెన్యూ అధికారులతో కలిసి మూలపేట సమీపంలోని సమీర్ ఎట లాజిస్టిక్స్‌కు చెందిన వెయ్యి ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణంతోపాటు రైలు, రోడ్డు మార్గాలు, విద్యుత్, నీటి సరఫరా అవసరాల సాధ్యాసాధ్యాలపై ఆరా తీశారు. గొట్టాబ్యారేజ్ నుంచి అవసరమైన నీటిని, రావివలస 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి ఆ బృందానికి వివరించారు. అనంతరం కల్యాణి స్టీల్స్ సంస్థ సభ్యులు భావనపాడు తీరం, ఇతర ప్రాంతాలు, ఈస్ట్‌కోస్ట్ పవర్‌ప్లాంట్ స్థలాలు పరిశీలించారు.

రెవెన్యూ గ్రీవెన్స్

పలాసరూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు రెండు వినతులు వచ్చినట్టు తహీల్దార్ ఎస్.కళ్యాణ చక్రవర్తి తెలిపారు. భూసమస్యలపై రెండు వినతులు వచ్చిందని తెలిపారు.